క్లుప్తంగా

చెరువులకు నీళ్లందించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి, తిమ్మాపూర్, పద్మనాభునిపల్లిలోని చెరువులకు మల్లన్నసాగర్ కాలువల ద్వారా నీళ్లు అందించాలని పలు గ్రామాల రైతులు శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి, ఎంపీ రఘునందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుల్లోకి నీళ్లు రాక పోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుల్లోకి నీరందించాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయండి: సీఐ శ్రీను



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సీఐ శ్రీను ఆదేశించారు. మండలంలోని గురిజకుంట వాగు సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని, వెటర్నరీ డాక్టర్ ఇచ్చిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పత్రాలు సరిగా లేని పక్షంలో వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆ పట్టా రద్దు చేయండి



ధర్నా చేస్తున్న మల్లేశం తదితరులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో అక్రమంగా మార్పిడి చేసిన భూ పట్టాను వెంటనే రద్దుచేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళనకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంపెల్లి మల్లయ్య భూమి విషయంలో జరిగిన తప్పిదంపై కోర్టు సూచనలను పట్టించుకోకుండా తహసీల్దార్ మరొకరికి పట్టా మార్పిడి చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

దిశ కమిటీ సభ్యుడిగా శివకుమార్



శివకుమార్

గజ్వేల్‌రూరల్ / (దుబ్బాక) :తొగుట కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, సమన్వయ జిల్లా కమిటీ సభ్యుడిగా నత్తి శివకుమార్ నియామకమయ్యారు. సిద్దిపేటలో శుక్రవారం ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దిశ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కమిటీలో తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా తొగుట మండల పరిధిలోని పెద్ద మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన తోలుకంటి రాజు బోర్డు కమిటీ సభ్యుడిగా నియామకమయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తానన్నారు.

ఆపదలో స్నేహితుల భరోసా



ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

దుబ్బాకటౌన్: ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన మహమ్మద్ షాదుల్ కుటుంబ సభ్యులకు స్నేహితులు అండగా నిలిచారు. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన షాదుల్ అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రాయపోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2009–2010 బ్యాచ్ స్నేహితులు శుక్రవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్వామి, శ్రీనివాస్, ఇంద్ర కరణ్, యాదగిరి, నాగరాజు తదితరులున్నారు.

శిక్షణ శిబిరం.. విజ్ఞాన వికాసం

- అంబిటస్, సాక్షి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు
- నేటితో ముగియనున్న శిబిరం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

సిద్దిపేటకమాన్: పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పిల్లలు ఆట పాటలతో కేరింతలు కొడతారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లో పిల్లలు సెల్‌ఫోన్‌లు, టీవీలకే పరిమితమవుతున్నారు. దీంతో నేత్ర సంబంధిత సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యల భారిన పడుతున్నారు. వారి శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడేలా వేసవి సెలవుల్లో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

సాక్షి, అంబిటస్ సంయుక్త ఆధ్వర్యంలో

సిద్దిపేట భరత్‌నగర్‌లోని అంబిటస్ పాఠశాలలో సాక్షి, అంబిటస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిబిరం నిర్వహిస్తున్నారు. 5 నుంచి ప్రారంభమైన ఈ శిబిరం శనివారంతో ముగియనుంది.

100 మందికి పైగా శిక్షణ

శిబిరంలో ప్రతి రోజు సుమారు వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొని పలు అంశాలను నేర్చుకుంటున్నారు. అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్ ఎద్ల శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ శిబిరంలో కరాటే మాస్టర్ భాగ్యరాజ్ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు కరాటేపై, టీచర్లు అపర్ణ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై, సాయికృప స్పోకెన్ ఇంగ్లిష్, శ్రీజ హ్యాండ్ రైటింగ్, మాస్టర్ వాసుదేవ్ నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. శిబిరం ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

ఉత్సాహంగా పాల్గొంటున్నారు



శిక్షణ శిబిరంలో ప్రతి రోజు విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శిబిరంలో ఐదుగురు ఉపాధ్యాయులు కరాటే, డ్యాన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్ రైటింగ్, యోగాపై శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను శిక్షణ శిబిరాలకు పంపించి క్రీడలపై మక్కువ కలిగేలా చొరవ చూపాలి.

– ఎద్ల శ్రీనివాస్‌రెడ్డి, అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్చుకున్నాను..



పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేశాను. ఈ శిక్షణ శిబిరంలో టీచర్ అపర్ణ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై నూతన విషయాలు నేర్పించారు. 15 రోజులుగా చాలా విషయాలను నేర్చుకున్నాను. ఇలాంటి శిబిరాలు నిర్వహించడం చిన్నారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నిర్వాహకులకు ధన్యవాదాలు.

– ఆరాధ్య, విద్యార్థిని

పంట మార్పిడితో అధిక దిగుబడులు

శాస్త్రవేత్త డా.రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమాదేవి

చిన్నకోడూరు(సిద్దిపేట): పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త డా.రమాదేవి రైతులకు సూచించారు. స్థానిక రైతు వేదికలో పంటల సాగుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన, పురుగు మందులను అధికారులు సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే వాడాలన్నారు. పచ్చిరొట్ట ప్రాధాన్యాన్ని విస్మరించొద్దని, ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు చేయించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రసీదును భద్రపర్చాలని చెప్పారు. సమావేశంలో ఏడీఏ పద్మ, హార్టికల్చర్ అధికారి భాస్కర్‌రెడ్డి, ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎఫ్ఎంఈ పథకంపై అవగాహన

రిసోర్స్ పర్సన్ వంశీ



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ వంశీ

దుబ్బాకటౌన్: పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే వారికి ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ(పీఎంఎఫ్ఎంఈ) పథకం ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా రిసోర్స్ పర్సన్ వంశీ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగంలోని ఆర్పీలకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు కోసం పరిశ్రమ ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులు ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం వాటా చెల్లించగలిగే సామర్థ్యం కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంకు మేనేజర్ అరుణ్ కుమార్, మెప్మా సీఈఓ రేణుక, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

వ్యవసాయాధికారి వసంతరావు



ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. మండలంలోని దౌలాపూర్‌లో ఆయిల్‌పామ్ సాగులో మెరుగైన పద్ధతుల గురించి శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 582 ఎకరాల్లో పంట సాగుచేశారని చెప్పారు. గ్రామంలో రైతులు ఉపేందర్‌రెడ్డి, నర్సమ్మ చేపట్టిన సాగులో మొదటి కాత వచ్చిందని, ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే అదనపు ఆదాయం కోసం గొర్రెలు, పాడి పశువుల పెంపకం, కూరగాయల సాగు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ మండల అధికారి రమేశ్, ఆయిల్ పామ్ ఏరియా అధికారి శంకర్, విజయ్, ఖలీల్, రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిద్దాం.. డెంగీ నివారిద్దాం



గజ్వేల్‌రూరల్: కోటమైసమ్మ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారులు, సిబ్బంది శుక్రవారం పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆయా ఆసుపత్రి వైద్యులు, హెచ్ఈఓ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొని డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అప్పుడే దోమలను నివారించుకోవచ్చని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని పిలుపునిచ్చారు.



జగదేవ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి సత్యప్రకాశ్



వర్గల్‌లో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి హరిత, సిబ్బంది

గురుకుల విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

దుబ్బాక: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన స్థానిక మైనార్టీ గురుకుల విద్యార్థులను కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ శుక్రవారం అభినందించారు. ఇటీవల వెలువడిన టెన్త్ ఫలితాలలో గురుకులానికి చెందిన పి.హరీశ్ మండల టాపర్‌గా నిలిచాడు. అలాగే ఇంటర్‌లో జహీర్, మర్రికింది భానుప్రసాద్ ఈఏపీ సెట్‌లోను, జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపారు. దీంతో కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు గురుకులం ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో డీఐఈఓ రవీందర్‌రెడ్డి, ఆర్ఎల్‌సీ సుధారాణి, ప్రిన్సిపాల్ విమలారెడ్డి, హమీద్, షాదుల్, మనోజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

అదనపు సీఐ ముత్యంరాజు



యువకులతో మాట్లాడుతున్న సీఐ ముత్యంరాజు

గజ్వేల్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని అదనపు సీఐ ముత్యంరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ ఆవరణ, సంగాపూర్ రోడ్డు, ఇందిరాపార్క్ చౌరస్తా, తూప్రాన్ రోడ్డుతోపాటు ఆయా పరిసరాల్లోని హోటల్స్, పాన్‌షాప్‌ల వద్ద, అనుమానాస్పద ప్రాంతాల్లో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్‌తో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిగిన చాక్లెట్స్ కలిగిఉన్నా, రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.10,500 జరిమానా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

వేసవి శిక్షణ ఎంతో ఉపయోగం

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



సిద్దిపేటజోన్: వేసవి శిక్షణ తరగతులతో ఎంతో ఉపయోగం ఉందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో గురువారం రాత్రి నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరస్వతి శిశు మందిరాలను కాపాడుకోవాలన్నారు. తన వంతు సాయంగా రెండు నెలల గౌరవ వేతనాన్ని శిశు మందిర్‌కు ఇస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో అప్పల ప్రసాద్, ప్రతినిధులు నరేశ్, వైకుంఠం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నివసిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుల వినతి

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, రోహింగ్యాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ భార్గవ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో మండల పరిధిలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో స్వామి, రమాకాంత్, ప్రభాకర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, అరవింద్, రాజు, స్వామి, గణేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ సొసైటీలో సభ్యత్వాల నమోదు

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లోని ముదిరాజ్‌లకు మార్కెటింగ్ సొసైటీలో సభ్యత్వాలు తీసుకోవాలని మార్కెట్ వైస్ చైర్మన్ చందు అన్నారు. శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వాలు లేక మత్స్యకారులు ప్రభుత్వం సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ముదిరాజ్‌లు మార్కెటింగ్ సొసైటీలో సభ్యత్వం తీసుకొంటే ప్రతి సభ్యుడికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. కూచనపెల్లిలో చెరువు లేనందున మత్స్యకారులు సొసైటీలో సభ్యులు కాలేదని, ఇప్పుడు మార్కెటింగ్ సొసైటీలో 38 మందికి సభ్యత్వాలు ఇప్పించామని తెలిపారు.

వైభవంగా పెద్దమ్మ కల్యాణం



అమ్మవారికి ఒడి బియ్యం సమర్పిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మతల్లి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు, మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి కల్యాణం నిర్వహించగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా సదుపాయాలు



మల్లుపల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని ఎంఈఓ ప్రవీణ్ తెలిపారు. మండల పరిధిలోని అందె, మల్లుపల్లి గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనంతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్వర్ణ, హెచ్ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జాషువా, బద్దిరాజ్, రాజాగౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే నిదర్శనం

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఇటీవల సాధించిన పదో తరగతి ఫలితాలే అందుకు నిదర్శనమని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వెంకట కృష్ణమాచారి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, అశోక్, రాజ్‌బాయ్, సీఆర్పీ నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. పనులు జరుగుతున్న స్థలాల వద్దకు వెళ్లి తమ పిల్లలను బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన బోధన, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, యాదయ్య, లలిత, సునీత, నాగమణి, వాణి తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: ధర్మాజీపేటలో..



మగ్దుంపూర్‌లో..

నంగునూరులో..

నంగునూరు(సిద్దిపేట): బడిబాట కార్యక్రమంలో భాగంగా మగ్దుపూర్, నర్మేట పాఠశాల ఆధ్వర్యంలో హెచ్ఎం సుధాకర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇంటింట తిరిగి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. మనీశ్‌కుమార్, యాదమల్లు, బాలరత్నం, రంజిత్‌రెడ్డి, కొమురయ్య, వెంకటేశం, రజిత, సుల్తానా, అర్షద్, సునీత పాల్గొన్నారు.



రామంచలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు